
Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

epaper.telanganaveena.com | సంపుటి :1 | సంచిక: 374 | హైదరాబాద్ | శనివారం | 28 -09 - 2024 | పేజీలు: 8 | రూ.3/-






## పర్యాటక ప్రాంతాలుగా
# చారిత్రక భవనాలు

- హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణ
- పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐ ఒప్పందం
- మూసీ ప్రక్షాళన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామన్న సిఎం రేవంత్

**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దు తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు ముందుకు రావాలని ఆయన పారిశ్రామికవేత్తలకు సూచించారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు తీసుకెళతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐ తో రాష్ట్ర పర్యాటక శాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా కారణంగా నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని సీఎం అన్నారు. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసన మండలి ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీ హాల్ కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రత్యేక టెక్నాలజీతో ఆ భవనాన్ని నిర్మించారని, భవిష్యత్తులో దాన్ని పరిరక్షించాల్సిన అవసరముందని

వివరాలు 2లో

# జగన్‌ను ఏ బిజెపి నేతా అడ్డుకోలేదు

- డిక్లరేషన్‌కు భయపడే తిరుమలకు వెళ్లలేదు
- డిక్లరేషన్ సంగతి తెలిసీ రాజకీయం చేయడం తగదు
- పొంగులేటి నివాసంలో ఐడి సోదాలకు బిజెపికి సంబంధం లేదు
- మీడియా సమావేశంలో మెదక్ బిజెపి ఎంపి రఘునందన్ రావు



**తెలంగాణ వీణ/ఖమ్మం,సెప్టెంబర్27:** తిరుమలకు తాను వెళ్తానంటే బీజేపీ నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారని ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఖండించారు. వైసీపీ అధినేతను బీజేపీ నేతలు ఎవ్వరూ అడ్డుకునే ప్రయత్నం చేయలేదని ఆయన అన్నారు. డిక్లరేషన్‌పై సంతకం పెట్టాల్సి వస్తుందనే జగన్ తమ పార్టీ నేతలపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు జగన్ చేసిన వ్యాఖ్యలకు రఘునందన్ రావు కౌంటర్ ఇచ్చారు. ఖమ్మం పర్యటన సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ... 'డిక్లరేషన్‌పై సంతకం పెట్టాల్సి వస్తుందనే తిరుమలకు జగన్ వెళ్లలేదు. బీజేపీ నేతలు ఆయణ్ని అడ్డుకోవడానికి చూశారనేది పచ్చి అబద్ధం. డిక్లరేషన్‌పై సంతకం పెట్టలేకే బీజేపీపై ఆయన బురదజల్లు తున్నారు. అన్యమతస్తులు దేవాలయాల్లోకి వెళితే డిక్లరేషన్‌పై సంతకం

వివరాలు 2లో

## ఎనుముల కాదు..
# ఎగవేతల రేవంత్ రెడ్డి



- అన్ని హామీలను ఎగవేస్తున్న సిఎం
- సిద్దిపేట రైతు ధర్నాలో హరీష్ రావు

**తెలంగాణ వీణ/సిద్దిపేట,సెప్టెంబర్27:** ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కార్‌కు హరీశ్‌రావు డెడ్‌లైన్ విధించారు. దసరా లోపు రైతులందరికీ రుణమాఫీ చేయాలి.. లేదంటే రైతులందరితో

వివరాలు 2లో

# నేడు నగరానికి రాష్ట్రపతి

## ముర్ము రాక సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒకరోజు పర్యటనకు శనివారం హైదరాబాద్‌కు రానున్నారు. ఇక్కడ నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. దీంతో ఆమె పర్యటన సందర్భంగా పలుచోట్ల ఆంక్షలు విధించారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక, అటవీ, విద్యుత్, తదితర శాఖల ఏర్పాట్లపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష నిర్వహించారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రతా ఏర్పాట్లు, బందోబస్తును పర్యవేక్షించాలని పోలీసులకు సూచించారు. అనంతరం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన 8 రాష్ట్రాలకు సంబంధించిన స్టాళ్లను, 4 ఫుడ్ కోర్టులను, మీడియా సెంటర్‌ను, ఇతర స్టాళ్లను పరిశీలించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని అడిషనల్ సీపీ ట్రాఫిక్ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఉదయం 9 గంటల నుంచి బేగంపేట, హెచ్‌పీఎస్, పీఎన్‌టీ జంక్షన్, రసూల్‌పురా, సీటీవో ఎ÷-లాజా, టివోలి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, బొల్లారం రాష్ట్రపతి నిలయం ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని తెలిపారు.మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పరిధిలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం 28న నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్నారు. గౌరవ అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, నల్సార్ ఛాన్సలర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింహులు విచ్చేస్తున్నట్లు విశ్వవిద్యాలయ వీసీ క్రిష్ణదేవరావ్ మీడియాకు వెల్లడించారు.

# గ్లోబల్ సిటీ హైదరాబాద్‌కు పెట్టుబడులతో తరలిరండి

- పరస్పర అభివృద్ధిలో పలుపంచుకుందాం
- తెలంగాణ వ్యాపార బంధాలు మరింత బలోపేతం
- వినూత్న ఆవిష్కరణలు, నిలకడతో కూడిన అభివృద్ధికి బాటలు వేద్దాం
- హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో మరిన్ని అవకాశాలు
- మైన్ ఎక్స్ పో ఇంటర్నేషనల్ సదస్సులో భట్టి పిలుపు



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పునరుత్పాదక విద్యుత్, వస్తు ఉత్పత్తిలో ఎంతో ముందు చూపుతో పురోగమిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అమెరికన్ కంపెనీల భాగస్వామ్యాన్ని సహకారాన్ని కోరుతోందని, గ్లోబల్ సిటీ హైదరాబాద్ కు పెట్టుబడులతో తరలిరావాలని తెలంగాణ అమెరికన్ కంపెనీలకు పిలుపునిచ్చారు. అమెరికాలోని లాస్ వెగాస్ లో జరుగుతున్న మైన్ ఎక్స్ పో 2024 అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రపంచ వ్యాప్త వ్యాపార దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రముఖ అమెరికన్ కంపెనీల ప్రతినిధుల సమావేశాలలో ఆయన మాట్లాడారు. భారతదేశ ఆర్థిక పురోగతిలో అమెరికన్ కంపెనీలు కీలక పాత్ర పోషించాయని, ముఖ్యంగా తెలంగాణలో దిగ్గజ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఫేస్ బుక్, ఆపిల్ సంస్థలు హైదరాబాద్ ను తమ స్వస్థలంగా భావిస్తూ.. వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని తద్వారా హైదరాబాద్ గ్లోబల్ ఐటీ కేంద్రంగా, ఇన్నోవేషన్ హబ్ గా రూపుదిద్దుకున్నదని తెలిపారు.

వివరాలు 2లో

# ఎమ్మెల్సీ తీన్మార్‌పై చర్యలు తీసుకోవాలి

- పోలీస్ స్టేషన్లో కంప్లయింట్ ఇచ్చిన ఓసి జాగృతి సంఘం...




# డిప్యూటీ సిఎం ఇంట్లో చోరీ



# వరద బాధితులకు భారత్ బైయోటిక్ కంపనీ భారీ విరాళం



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 27:**వరద బాధితుల సహాయార్థం భారత్ బయోటెక్ కంపెనీ ముఖ్యమంత్రి సహాయ నిధికి ఒక కోటి రూపాయల విరాళం అందించింది. భారత్ బయోటెక్ కో-ఫౌండర్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్రా ఎల్లా సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆ మేరకు చెక్కును అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడం లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అండగా విరాళం అందించినందుకు ముఖ్యమంత్రి వారిని అభినందించారు.

# సిఎంను కలిసిన జపాన్ కాన్సులేట్ జనరల్...



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఈ భేటీలో పలు అంశాలపై చర్చ జరిగింది. చెన్నై కేంద్రంగా పనిచేసే జపాన్ కాన్సులేట్ తెలంగాణతో కొనసాగిస్తోన్న సంబంధాలు, నిర్వహిస్తోన్న కార్యక్రమాలను ఈ సందర్భంగా టకాహషి మునియో ప్రస్తావించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారిణి (ఆర్ పిఓ) జొన్నలగడ్డ స్నేహజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధికి రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళం



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధి కి రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళాన్ని అంద జేసింది. రూ.20 కోట్ల చెక్కును సీఎంఆర్ఎఫ్‌కు అందజేశారు. శుక్రవారం ఉదయం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి ఎం ఎస్ ప్రసాద్, బోర్డు సభ్యులతో పాటు తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రిలయన్స్ గ్రూప్ మెంటార్ పి వి ఎల్ మాధవ రావులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎంను కలిసి ఆయనకు రూ.20 కోట్ల చెక్కును అందజేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో వరద సంభవించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఖమ్మం జిల్లా పూర్తిగా నీట మునిగింది. అనేక మంది ఇళ్లను కోల్పోయారు. ఈ నేపథ్యంలో వరద బాధితులను ఆదుకునేం దుకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు చిరంజీవి, బాలకృష్ణ, ఎన్టీఆర్, మహేశ్ బాబు, సాయిధరమ్‌తేజ్, విశ్వక్‌సేన్ సహా పలువురు విరాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో పి ఎం ఎస్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బోర్డు సభ్యులు, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్,పి వి ఎల్ మాధవరావు, పాల్గొన్నారు.

# దేశంలో పెరగనున్న చక్కెర ధరలు

**తెలంగాణ వీణ/హైదరాబాద్,27:** దేశంలో చక్కెర ధరలు పెరగనున్నాయి. 2024-25 సీజన్ అక్టోబర్-సెప్టెంబర్‌కు సంబంధించి చక్కెర, ఇథనాల్ కనీస విక్రయ ధర (ఎంఎస్‌పీ) పెంచాలని కేంద్రం నిర్ణయించడంతో చక్కెర ధర పెరగనుంది. 'చక్కెర కనీస విక్రయ ధరను పెంచాలన్న ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్నాం. అలాగే ఇథనాల్ ధరను కూడా పెంచుతాం. ఈ విషయం పెట్రోలియం శాఖ పరిశీలిస్తుందని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.



# జగన్‌ను ఏ బిజెపి నేతా అడ్డుకోలేదు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టాలని రాజ్యాంగంలో ఉంది. మసీదులోకి వెళ్తే టోపీ, కర్చీఫ్ పెట్టుకుంటున్నారు. అలాగే హిందూ ఆలయాలకు వస్తే డిక్లరేషన్‌పై సంతకం పెట్టాలి. 5సార్లు తిరుమలకు వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించినట్లు స్వయంగా జగనే చెప్తున్నారు. ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, లేనప్పుడు తిరుమలకు వైసీపీ అధినేత వెళ్లారు. ఆయన తిరుమలకు రావడంలో ఎలాంటి తప్పు లేదు. అయితే ఆలయ నిబంధనల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వాలి. దానిపై సంతకం పెట్టాలనే హిందూ సమాజం ఆయణ్ని అడిగింది. ఇది ఫ్యాన్ పార్టీ అధినేతకే కాదు.. అందరికీ వర్తిస్తుంది. ప్రతి రోజూ వేల మంది దళితులు తిరుమలకు వెళ్తున్నారు. ఇప్పటివరకూ తిరుమల వద్ద కులం పంచాయితీ లేదు. కానీ ప్రస్తుతం జగన్ ఆ ప్రస్తావన తెస్తున్నారు. డిక్లరేషన్‌పై సంతకం పెడితే పాస్టర్లతోనో లేక విదేశాల నుంచి వచ్చే ఫండ్స్‌కు ఇబ్బంది వస్తుందనో ఏమో ఆయన సంతకం పెట్టలేక తిరుమల పర్యటనపై వెనక్కి తగ్గారని మండిపడ్డారు. అన్యమతస్తులు పవిత్ర తిరుమల ఆలయానికి వస్తే డిక్లరేషన్ ఇవ్వాల్సిందే. కేవలం ఇక్కడే కాదు.. చాలా హిందూ ఆలయాల్లో ఈ విధానం ఉంది. దేశంలో చాలా ఆలయాల్లో డిక్లరేషన్ నిబంధన ఉంది. మీరు ఏపీ సీఎంగా ఉన్నప్పుడు కూడా ఈ విధానం ఉంది. బీజేపీనో, రఘునందన్ రావో దీన్ని తీసుకురాలేదు. శ్రీవారి లడ్డూ తయారీకి టెండర్లు ఏ విధంగా పిలుస్తారో.. అలాగే అన్యమతస్తులు తిరుమలకు వస్తే డిక్లరేషన్ ఇవ్వాలి. దీనిపై సంతకం పెట్టడం ఇష్టం లేకే తనను బీజేపీ నేతలు అడ్డుకునేందుకు ప్రయత్నించారని జగన్ చెప్తున్నారు. సంతకం పెడితే తన మతం వారికి కోపం వస్తుందనే భయంతోనే తిరుమల పర్యటన జగన్ రద్దు చేసుకున్నారని మండిపడ్డారు. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఐటీ దాడులు ఇప్పుడు కొత్తగా జరగడం లేదు.. ఎప్పట్నుంచో జరిగేవే. మేము ఐటీ దాడులతో పొంగులేటిని భయపెట్టి బీజేపీలోకి తీసుకోవాలని అనుకోవడం లేదు. అలా అనుకుంటే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలనే మా పార్టీలోకి తీసుకుంటాం. చట్టం ముందు అందరూ సమానమే. ఇన్‌కమ్ ట్యాక్స్ కట్టని వాళ్ల మీద ఐటీ, ఈడీ దాడులు జరుగుతాయి. పొంగులేటి ఇంటి మీద జరిగిన దాడితో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదు. చట్టానికి ఏ పార్టీ అయినా ఒకటే. గతంలో పొంగులేటి కుమారుడి విషయంలోనూ విచారణ జరిగింది' అని అన్నారు.

# ఎనుముల కాదు..ఎగవేతల రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

కలిసి సచివాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్ధిపేట జిల్లా నంగునూరులో రైతులు నిర్వహించిన ధర్నాలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులు ఏ విధంగా ఉండే.. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉంది అనేది అందరికీ అర్థమైందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకముందు రైతుల పరిస్థితి ఎలా ఉండే. రైతులకు ఎరువు బస్తా కావాలంటే పొద్దున ఐదు గంటలకు చెప్పులు లైన్లో పెడితే ఒక్క ఎరువు బస్తా దొరికేది. రైతులను ఎరువు బస్తాల కోసం లైన్ల నిలబెట్టింది కాంగ్రెస్. కానీ కేసీఆర్ ప్రతి ఊరికి ఎరువులను లారీల్లో పంపి రైతులకు అందించారు. కేసీఆర్ రాకముందు కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు. కేసీఆర్ వచ్చినంక 24 గంటల కరెంటు ఇచ్చిండు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలకుండా కడుపునిండా రైతులకు కరెంటు ఇచ్చిండు. కాంగ్రెస్ పాలనలో దొంగ రాత్రి కరెంట్ వచ్చేది. కేసీఆర్ 24 గంటలు కరెంట్ అందించాడు. మళ్లీ కాంగ్రెస్ పాలనలో కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు. కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి ఏదో మీటింగ్‌లో అంటున్నారు కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటలు కరెంటు ఎట్లా వచ్చింది ఇప్పుడు ఎందుకు వస్తలేదని కరెంట్ అధికారులను ఆమె అడిగారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమైంది? కరోనా లేదు అయినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వడం లేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కేసీఆర్ ఉండగా నాట్లు పడే వరకు రైతుల ఫోన్లలో టింగు టింగ్ అని రైతుబంధు పడేది. ఇప్పుడు నాట్లు అయి, కలుపై, పంటకు మందు కొట్టుడు కూడా అయిపోయింది. పంట కోతకు ఉన్నా, దసరా పండుగ దగ్గరకు వస్తున్నా ఇంకా రైతుబంధు పడలేదు. మాటలు మాత్రం కోటలు దాటుతాయి. అన్ని వంకర మాటలే కానీ రైతులకు మాత్రం రైతుబంధు వేస్తలేడు రేవంత్ రెడ్డి. రైతుబంధుకు కేసీఆర్ ఉండంగా ఎకరానికి రూ.4,000 ఇచ్చిండు. మళ్లీ గెలిస్తే రూ.5,000 ఇస్తానని ఇచ్చిండు. మళ్లీ గెలిస్తే రూ. 8,000 చేస్తా అన్నాడు గెలిస్తే చేస్తుండే. కాంగ్రెస్ గెలిచి రూ. 7,500 రైతుబంధు ఇస్తా అన్నారు. పోయిన యాసంగికి రూ. 5,000 ఇచ్చింద్రు. ఈ పంటకు మొత్తానికి ఎగబెట్టారని హరీశ్‌రావు మండిపడ్డారు. ల్గ÷తులను అప్పుల పాలు చేస్తున్నడు రేవంత్ రెడ్డి. పంట పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేసే పరిస్థితి ఏర్పడింది. అబద్దాలు చెప్పి కుంటి సాకులు చెప్పి ఇప్పటిదాకా రైతులకు రైతుబంధు పైసలు ఇవ్వలేదు. రాష్ట్రంలో రైతులను ఆగం చేయడం కాదా? కేసీఆర్ ఒక్కసారి కాదు 11 సార్లు రైతుబంధు ఇచ్చిండు. ఊరు ఊరుకి కొనుగోలు కేంద్రాలు పెట్టి టైమ్‌కు వడ్లు కొనుడు అయినా, వడ్లను కొన్న పైసలు కూడా మూడు రోజులనే రైతులకు అందించిండు కేసీఆర్ అని హరీశ్‌రావు తెలిపారు.రేవంత్ రెడ్డి కాళేశ్వరం కూలిపోయింది అంటున్నాడు. వచ్చి రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ చూడు రేవంత్ రెడ్డి. కాళేశ్వరం కూలిపోతే నీళ్లు ఎట్లా వచ్చినాయో చూడు మరి. రేవంత్ రెడ్డికి కూలగొట్టుడు తప్ప కట్టుడు తెలవదు. కాళేశ్వరంలో 100 భాగాలు ఉంటాయి. ఒక్క భాగంలో 160 పిల్లర్లలో రెండు పిల్లర్లకి చిన్న పగుళ్లు వచ్చినాయి దానికి కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని అబద్ధ ప్రచారం చేస్తున్నాడు. ఎన్నడైనా ఏదైనా కట్టిన ముఖం అయితే రేవంత్ రెడ్డికి తెలిసేది. కాళేశ్వరంలో మూడు బ్యారేజీలు, 19 పంప్ హౌస్‌లు, 18 రిజర్వాయర్లు, సొరంగాలు, కాలువలు, పైపులైన్లు. ఇండ్ల రెండు పిల్లర్లకు మాత్రమే పగుళ్లు వచ్చాయని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# రేషన్ కార్డు లేకున్నా ఇందిరమ్మ ఇల్లు



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** రేషన్ కార్డు లేకున్నా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు కొత్తగా ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీలు అలాంటి అర్హులను గుర్తిస్తాయని తెలిపారు. దసరా నాటికి ఆ కమిటీలను అందుబాటు లోకి తీసుకొస్తామని అన్నారు. గ్రామస్థాయి కమిటీలో సర్పంచ్/పర్సన్ ఇన్ చార్జి, గ్రామ కార్యదర్శి, ముగ్గురు సేవా కార్యకర్తలు ఉంటారని తెలిపారు. అవసరమైతే ఇండ్ల సంఖ్య పెంచుతామని మంత్రి స్పష్టం చేశారు.

# డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నివాసంలో చోరీ జరిగినట్లు తెలుస్తోంది. పశ్చిమ్‌బెంగాల్‌లో ఖరగ్‌పూర్ జీఆర్‌పీ పోలీసులు ఇద్దరి నిందితులను అరెస్ట్ చేశారట. వారి నుంచి వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ ఘటనపై తెలంగాణ పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నామని జీఆర్పీ ఎస్పీ దేబశ్రీ సన్యాల్ వెల్లడించారు. భట్టి విక్రమార్క విదేశీ పర్యటనలో ఉండగా ఈ చోరీ జరిగినట్లు తెలుస్తోంది. నిందితులు బిహార్‌కు చెందిన రోషన్‌కుమార్ మండల్, ఉదయ్‌కుమార్ ఠాకూర్‌గా గుర్తించామని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పర్యాటక ప్రాంతాలుగా చారిత్రక భవనాలు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం అభిప్రాయపడ్డారు. జూబ్లీహాల్‌ను దత్తత తీసుకొని పరిరక్షించాలని ఆయన సీఐఐకి సూచించారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిస్తామని, ఇందుకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నట్లు సీఎం వివరించారు. హైకోర్టు భవనాన్ని కూడా రక్షించాల్సిన అవసరముందని సీఎం అన్నారు. రాజేంద్రనగర్ లో హైకోర్టు నూతన భవనం నిర్మాణం కోసం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ భవనంతో పాటు పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించు కోవాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందన్నారు. నగరంలో పురాతన మెట్ల బావులను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు ఒప్పంద పత్రాలు అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్దరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. సాయి లైఫ్ సంస్థ మంచిరేవుల మెట్ల బావిని దత్తత తీసుకుంది. భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్దరించనున్నది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్ నుమా మెట్ల బావిని టీజీ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్దరించనున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉచితంగా రాష్ట్రంలో పర్యాటక, చారిత్రక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని తీసుకువచ్చామని, దానికి సంబంధించిన జీవోను ఇప్పటికే జారీ చేశామన్నారు. చారిత్రక, పర్యాటక ప్రాంతాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం తెలంగాణ దర్శిని తీసుకుని వచ్చినట్లు సీఎం వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# గ్లోబల్ సిటీ హైదరాబాద్‌కు పెట్టుబడులతో తరలిరండి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రప్రభుత్వ వ్యాపార అనుకూల విధానాలు, నైపుణ్యం గల మానవ వనరులు, చక్కని మౌలిక సదుపాయాలు గల హైదరాబాద్ సిటీ పెట్టుబడులకు స్వర్గధామం కానున్నదని కనుక అమెరికన్ కంపెనీల వారు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటూ పెట్టుబడులతో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రత్యేకతను వివరిస్తూ ఈ మహానగరం టెక్నాలజీ హబ్ గానే కాకుండా ఫార్మాసిటీ రంగంలో గ్లోబల్ లీడర్ గా ఉంటుందన్నారు. కరోనా విపత్కర సమయంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, అరబిందో ఫార్మా, బైలాజికల్-ఇ, భారత్ బయోటెక్ వంటి కంపెనీల ఆవిష్కరణలతో "వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ ద వరల్డ్" గా, ఈ నగరం ప్రపంచ ఖ్యాతి గడించిందన్నారు.ఐటీ అభివృద్ధిలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ ఆవిష్కరణ జరుగుతోందని, ఇక్కడ ఏ.ఐ. తో నిర్వహించే పరిశ్రమలు, ఏ.ఐ. అభివృద్ధి, స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, గ్రీన్ ఎనర్జీ ఆవిష్కరణలకు పెద్ద పీట వేస్తున్నామని, ఈ విభాగాల్లో ఆసక్తిగల, అనుభవం ఉన్న ప్రపంచవ్యాప్త కంపెనీలకు తెలంగాణ స్వాగతం పలుకుతుందన్నారు.ఈ సందర్భంగా ఆయన తెలంగాణలో పెట్టుబడులకు గల అవకాశాలను కూడా వివరించారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఇంధన మరియు పారిశ్రామిక విధానాలు రూపొందించడం జరిగిందని, కొత్త ఆవిష్కరణలకు, ఆర్థికాభివృద్ధికి ముఖ్యంగా పునరుత్పాదక విద్యుత్ అభివృద్ధికి ఎక్కువ అవకాశాలుంటాయన్నారు.హైదరాబాద్ లో ఇప్పటికే ఉన్న అమెరికన్ కంపెనీలకు ఇక్కడ సానుకూల వాతావరణం, నైపుణ్యం గల మానవ వనరులు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీని వృద్ధి చేయడానికి, నిలకడగల అభివృద్ధికి దోహదం చేసే సొల్యూషన్స్ కు ఎక్కువ అవకాశాలున్నాయన్నారు. హైదరాబాద్ లో నైపుణ్యత గల మానవ వనరులకు కొదవలేదని, పర్యావరణహిత పునరుత్పాదక ఎనర్జీ మరియు గ్రీన్ టెక్నాలజీలకు, సంబంధిత పరిశ్రమలకు అవకాశం మెండుగా ఉంటుందన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తో పాటు ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ ఇంకా ఇతర అధికారులు పాల్గొన్నారు.మైనెక్స్ 2024 లో గురువారం నాడు (సెప్టెంబర్ 26) ఆయన ఆస్ట్రేలియాకు చెందిన డోపల్ మేర్ కంపెనీ స్టాల్ ను సందర్శించారు. ఈ కంపెనీ రూపొందించిన అత్యాధునిక బొగ్గు మరియు ఓవర్ బర్డెన్ రవాణా బెల్టులను, వాటి పనితీరును పరిశీలించారు. సౌత్ ఆఫ్రికా, స్విజర్లాండ్, గ్యాటిమల వంటి దేశాలలో తమ కంపెనీ బెల్టులతో జరుగుతున్న రవాణా ప్రక్రియను స్టాల్ నిర్వాహకులు వివరించారు.

# ఎమ్మెల్సీ తీన్మార్‌పై చర్యలు తీసుకోవాలి

**- పోలీస్ స్టేషన్లో కంప్లయింట్ ఇచ్చిన ఓసి జాగృతి సంఘం...**



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** ఇంతకీ తీన్మార్ మల్లన్న చేసిన తప్పేంటటా అంటే...తెలంగాణ రాష్ట్రంలో కేవలం 6.98 శాతం ఉన్న ఓసి లకు ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10% రిజర్వేషన్ ఎట్లా ఇస్తారని,దిని వల్ల బీసీ బిడ్డలకు అన్యాయం జరుగుతుందనీ గొంతెత్తి చెప్పినందుకు చర్యలు తీసుకోవాలి అట....మరి తీన్మార్ మల్లన్న చెప్పిన దాంట్లో ఎం తప్పు ఉన్నది..???ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఓసి ల్లో ఉన్న పేద వర్గాలకు ఈ రిజర్వేషన్ ఇవ్వాలి...అంటే 6.98% శాతం ఉన్న ఓ సి ల్లో మహా ఐతే 1 లేదా 1.5% శాతం మాత్రమే పేదవాళ్ళు ఉంటారు...మరి 1.5% శాతం ఉన్న వాళ్లకి 10 % శాతం రిజర్వేషన్ ఇవ్వడం అంటే మన బీసీల నోట్లో మట్టి కొట్టినట్టే కదా.... ఈ విషయాన్ని పూస గుచ్చినట్టు మోసపోతున్న బీసీలకు చెప్పినందుకు తీన్మార్ మల్లన్న పైన కేసు పెట్టీ అరెస్టు చేయాలి అని అంటున్నది.ఈ రెడ్డి జాగృతి ....మా కంచంలో నుండే బువ్వ ఎత్తుకొని పోతారు. ఇదెందిరా అని అడుగుతే ఉల్టా మా మీదనే కేసులు పెడుతున్నారు.బీసీ సమాజమా ఇప్పటికైనా మేల్కొకపోతే మనకు మిగిలేది బొచ్చె మాత్రమే.

# తిరుపతి లడ్డుపై కేంద్రం సీరియస్: అర్వింద్



**తెలంగాణ వీణ/నిజామాబాద్,సెప్టెంబర్27:** తిరుపతి లడ్డు వివాదంపై కేంద్రం సీరియస్‌గా ఉందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. లడ్డు మాత్రమే కాదు భక్తులు ఇబ్బందిపడ్డారన్నారు. సనాతన ధర్మ స్థాపన కోసం గతంలోనే బోర్డు ఏర్పాటు కావాల్సిందన్నారు. హిందూ సమాజాన్ని ఐక్యతను దెబ్బ తీసే కుట్ర జరుగుతోంది.. తిరుపతి లడ్డూ కల్తీ పై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం బీజేపీనే అన్నారు బీజేపీ ఎంపీ అర్వింద్. కష్టపడి పనిచేస్తే వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని చెప్పారు. బీఆర్ఎస్ కు కుక్క కూడా ఓటేయదన్నారు అర్వింద్. హైడ్రా కూల్చివేతలు సెలెక్టివ్ గా కాకుండా సెక్యులర్ గా ఉండాలన్నారు. కులం, మతం, ప్రాంతం వంటి బేధాలు చూడొద్దని అన్నారు. హైడ్రాను జిల్లాలకు విస్తరించాలన్నారు. వరి కోతలు మొదలు కాకముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
జనరల్ NEWS
శనివారం 28 సెప్టెంబర్ 2024

# కరీంనగర్ స్మార్ట్ సిటీ పెండింగ్ పనులు

# త్వరగా పూర్తి చేయాలి

**- అవినీతి ఆస్కారం లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి - ఎన్జీటి కేసు తదితర అంశాలు తీసుకోవాల్సిన చర్యలపై ఆరా - కరీంనగర్ స్మార్ట్ సిటీపై సమీక్షా సమావేశంలో ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ కమిటీ పనితీరు పై మంత్రి పొన్నం ప్రభాకర్ అసంతృప్తి**





**తెలంగాణ వీణ/హైదరాబాద్:** కరీంనగర్ స్మార్ట్ సిటీ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్ లోని తన ఛాంబర్ లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ లో మొత్తం 47 పనులు ప్రారంభించగా 25 పనులు పూర్తయ్యాయనీ ,మరొక 20 పనులు ప్రస్తుతం వర్క్స్ నడుస్తున్నాయని, రెండు పనులు ప్రారంభం కాలేదని కరీంనగర్ మున్సిపల్ అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకొచ్చారు. స్మార్ట్ సిటీలో ఇప్పటికే పూర్తైన ,ప్రస్తుతం నడుస్తున్న పనులపై మంత్రి పొన్నం ప్రభాకర్ సలహాలు సూచనలు చేశారు.ఇప్పటికే అంబేద్కర్ స్టేడియంలో చేపట్టిన పెండింగ్ పనులు నెలరోజుల్లోపు పూర్తి చేయాలని డెడ్లైన్ విధించారు. స్మార్ట్ సిటీ లో భాగంగా కరీంనగర్ లో 27 స్కూల్ లు డెవలప్మెంట్ చేయగా అందులో ఎన్ని పూర్తయ్యాయి.. డెవలప్మెంట్ లో భాగంగా చేసిన అభివృద్ధి మౌలిక వసతులు ఏం చేశారని ఆరా తీశారు. స్మార్ట్ సిటీ లో భాగంగా పూర్తైన స్కూల్ లు ఇతర పనులను త్వరలోనే ప్రారంభించి కోవడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.స్మార్ట్ సిటీ లో భాగంగా అభివృద్ధి చేసుకున్న సర్కస్ గ్రౌండ్ నగర ప్రజలకు ఎంత వరకు ఉపయోగపడుతుంది దాని మెయిన్టనేన్స్ కి వస్తున్న ఆదాయం తదితర వాటిపై ఆరా తీశారు.ఈ లెర్నింగ్ స్మార్ట్ క్లాస్ రూం ల గురించి అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్ సిటీ లో భాగంగా కరీంనగర్ లో అభివృద్ధి చేస్తున్న జంక్షన్ లు ఓల్డ్ పవర్ హౌజ్ జంక్షన్ ,హెచ్ కెఆర్ జంక్షన్ ,సదా శివంపల్లి జంక్షన్ , తెలంగాణ చౌక్ తదితర వాటిపై ప్రొజెక్టర్ ద్వారా వీక్షించారు. కొన్ని జంక్షన్ లకు అనుమతి లేకుండా ఇష్టారీతిన అంచనా విలువ పెంచారని వాటి వివరాలు సేకరించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ ను ఆదేశించారు.నగరంలో ఉన్న డంపింగ్ యార్ట్ విషయంలో పీఏంసీ పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.సరైన విధానాలు పాటించకపోవడం వల్లే డంపింగ్ యార్డ్ మంటలు అంటుకొని కరీంనగర్ పట్టణం పొగ భారిన పడుతు ందని తెలిపారు. డంపింగ్ యార్డ్ పై ఏం చేస్తే బాగుంటదన్న దానిపై అధికారుల తో చర్చించారు. స్మార్ట్ సిటీ లో భాగంగా రోడ్ల పై వరద నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు ఏబీడీ ప్రాంతాలు లేబర్ అడ్డా రోడ్ నుండి టూ టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు పై చేసిన దానిపై ఆరా తీశారు. కరీంనగర్ లో నిర్మించిన కమాండ్ కంట్రోల్ లో సిటీ నుండి అనుసంధానం పై అయినా కెమెరా లు ఎన్ని ..ఎన్ని ప్రాంతాల్లో మైక్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. వైఫ్ హాట్ స్పాట్ ప్రాంతాలు ఎన్ని ఏర్పాటు చేశారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా డిగ్రీ కాలేజి లో ఏర్పాటు చేసిన వర్షపు నీటి ఇంకుడు గుంతల పనితీరు అందులో ఉపయోగిస్తున్న మెటీరియల్ ,ఎన్ని నీళ్ళు లోపలికి వెళుతుంది తదితర వివరాలు ఆరా తీశారు. ధోభీఘట్ పెండింగ్ ఎలక్ట్రిక్ కనెక్షన్ లపై సూచనలు చేశారు.ప్రస్తుతం నడుస్తున్న పనుల్లో క్వాలిటీ, క్వాంటిటీ మెయింటెయిన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్జీటి కేసుపై డిసెంబర్ వరకు ఉండడంతో దానిపై ఏం చేస్తే బాగుంటదని అధికారులతో చర్చించారు. ప్రస్తుతం కడుతున్న కట్టడాలు త్వరలోనే విజిట్ చేస్తానని ఎక్కడ నిర్లక్ష్యం కనిపించిన సహించేది లేదని హెచ్చరించారు. మానేరు రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ లో మంజూరైన నిధులు ఇప్పటి వరకు చేసిన పనులు ఇంకా చేయాల్సినవి బ్యూటిఫికేషన్ తదితర వాటిపై ఆరా తీశారు.రైలింగ్ ,ల్యాండ్ స్కెపింగ్ ,మ్యూజికల్ పార్క్ తదితర యానిమేషన్ చిత్రాలను చూశారు.మానేరు రివర్స్ ఫ్రంట్ డెవలప్మెంట్ లో కేబుల్ బ్రిడ్జి బయట వరకు ఉండే నీటి నిల్వ తదితర వాటిపై సూచనలు చేశారు.సమీక్షాలో మున్సిపల్ అడ్మిని స్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ మున్సిపల్ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక , కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్పెయ్, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ,ఇరిగేషన్, టూరిజం,మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## అడిషనల్ డీజిపినికలిసిన రామగుండం పోలీస్ కమీషనర్...



**తెలంగాణ వీణ/మంచిర్యాల, సెప్టెంబర్ -27:** టీజీఎస్ పి 13th బేటాలియన్, గుడిపేట మంచిర్యాల సందర్శనకు వచ్చిన అడిషనల్ డిజిపి బెటాలియన్స్ హైదరాబాద్, శ్రీ సంజయ్ కుమార్ జైన్ని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీ ఎం. శ్రీనివాస్, ఐజి మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందచేశారు.

## వరి పంట పరిశీలన



**తెలంగాణ వీణ/రామగిరి:** శుక్రవారం కల్వచెర్ల గ్రామ పరిధి లో గల వరి పంట ను మంథని వ్యవసాయ సహాయ సంచాలకులు అంజనీ పరిశీలించటం జరిగింది.పరిశీలనలో భాగంగా వరికి ఆకు ఎండు తెగులు(బాక్టీరియా లీఫ్ బ్లైట్ బిఎల్ బి) గమనించటం జరిగింది.దినికి ఒక ఎకరానికి 100 గ్రాములు ప్లాంటో మైసిన్ లేదా స్ట్రెప్టో మైసీన్,కాపర్ హైడ్రాక్సైడ్ తో కలిపి పిచికారి చేయాలి.మరియు పాము పొడ తెగులుకు ఎకరానికి 400 ml హెక్సాకెనజోల్ పిచికారి చేయాలని తెలిపారు.సందర్శనలో మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్,ఏఈవో అరవింద్,రైతులు పాల్గొన్నారు.

## సేవ పురస్కారం అందుకున్న శామ్యూల్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే కర్తవ్యంగా భావించి సేవ చేస్తున్న పోగుల ఆశీర్వాదం శామ్యూల్ కు సేవ పురస్కారం వరించింది. శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే హైదరాబాద్ డివిజన్ ఆడిటోరియంలో ఆల్ ఇండియా రిటైర్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగం చేస్తూ రక్తదానం ఇస్తూ రైల్వే కార్మిక సంఘాల్లో తన పాత్రను శామ్యూల్ పోషించారు. అంతేకాకుండా రైల్వేలో రిటైర్డ్ అయి పెన్షనర్స్ కు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్ శ్రీధర్ కొనియాడారు. ఆయన చేసిన సేవలకు పురస్కారం అందించడం గొప్ప విషయమన్నారు. ఫెడరేషన్ ప్రతినిధులు రిటైర్డ్ పెన్షనర్స్ తదితరులు పాల్గొన్నారు.

# సన్మాన సభకు తరలిన తెలంగాణ ఉద్యమకారులు


**- ఉద్యమకారులను ఘనంగా సన్మానించిన టియుఎఫ్**
**- ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి**



**తెలంగాణ వీణ/పెద్దపల్లి :**పెద్దపల్లి జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు సికింద్రాబాద్ లోని హరిహర కళ భవన్లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ఘన సన్మాన సభకు జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 13 సంవత్సరాలు ఉద్యమం చేశామని, రాష్ట్రంవస్తే తమ బతుకులు మారుతాయని ఎన్నడు వేనుతిరిగి చూడకుండా ఉద్యమాన్ని ముందుకు నడిపామని తేలిపారు. మన ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులను గుర్తింపు ఇస్తామని, 250 గజాల ఇంటిస్తలం మరియు పెన్షన్ ఇస్తామని చెప్పడం పట్ల తమకు నాయం చేస్తారని ఆశిస్తున్నామని అన్నారు.250 గజాల ఇంటి స్థలం ఇస్తామని చెప్పడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర సిఎంకి మరియు మంత్రులకు,ఎంపీలకు, ఎమ్మెల్యేలకు ఉద్యమకారులు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో చాలామంది పేద,మధ్యతరగతి ఉద్యమకారులు పాల్గొన్నారు అని రాష్ట్రంకోసం ఎన్నో రోజులు వేచి చుసామని చాలా ఆర్థికంగా నష్టపోయామని కనీసం ఇప్పుడైన సి ఎం తమను ప్రజా ప్రభుత్వంలో గుర్తించి ఉద్యమకారుల సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని కోరారు. సభకు హాజరైన ఉద్యమకారులందరికీ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఉద్యమకారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పరపతి సంఘాలు రైతులకు ప్రయోజకరం: పెద్దపల్లి ఎమ్మెల్యే

**తెలంగాణ వీణ/జూలపల్లి:** పెద్దపల్లి నియోజకవర్గం జూలపల్లి మండలంలోని గోల్డెన్ పంక్షన్ హాల్ లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 128 వ సర్వ సభ్య సమావేశం చైర్మన్ కొంజర్ల వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరై రైతులకు సొసైటీ సభ్యులకు అధికారులకు పలు సూచనలు చేసిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు.. ముందుగా ఎమ్మెల్యే ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు రైతులకు సహకార సంఘాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ ఏర్పడ్డకా ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణాలను మాఫీ చేయడంతో పాటు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని నిరంతరం సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని అన్నారు.గతప్రభుత్వం అబద్ధాల పునాదులమీద పుట్టి ప్రతి మాట అబద్ధాలు చెబుతు రైతులను నిలువు దోపిడి చేసిందని ఏద్దవ చేశారు... సిఎం వర్షాకాలం పంటకు సన్న రకాల వడ్లకు 500 రూ.ల బోనస్ ఇస్తామని తెలిపారు.. రైతుల బాగు కోరేది ముఖ్యమంత్రి అని అన్నారు. నిరంతరం రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ నాయకులు పనిగట్టుకొని బదనాం చేస్తున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ లు కొంజర్ల వెంకటయ్య,వేణుగోపాల్ రావు,వైస్ చైర్మన్ ముత్తు లింగం,సి.ఈ.ఓ సుధాకర్,ఏఓ ప్రత్యూష,సహకార సంఘం డైరెక్టర్లు, అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



---

# సీయం రేవంత్ రెడ్డికి సింగరేణీ మారుపేర్ల భాధితుల పోస్టు కార్డుల ఉద్యమం

**తెలంగాణ వీణ/గోదావరిఖని:సెప్టెంబర్ 27:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గోలివాడ ప్రసన్న కుమార్ గంగపుత్ర ఆధ్వర్యంలో సింగరేణి మారుపేర్ల బాదితుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పోస్టు కార్డులను తపాలా పెట్టెలో వేయడం జరిగింది. స్థానిక గోదావరిఖని పట్టణంలోని సూర్యనగర్ ప్రధాన తపాలా కార్యాలయం వద్ద సింగరేణి మారుపేర్ల తో ఇబ్బందులను ఎదుర్కొంటున్న కార్మిక వారసుల సమస్యలను పరిష్కరించాలని పోస్టు కార్డుల ద్వారా సీయం రేవంత్ రెడ్డికి విన్నవించడం జరిగింది. ఈ సందర్భంగా గోలివాడ ప్రసన్న కుమార్ గంగపుత్ర మాట్లాడుతూ " సింగరేణి సంస్థలో కార్మికులు రెక్కలు ముక్కలు చేసుకొని పనిచేసి, సంస్థ అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించి, రిటైర్ అయిన కార్మికులు, వారిపై ఆధారపడ్డ వారి కుటుంబ సభ్యులు, వారి వారసులు మారు పేర్ల వలన ఉద్యోగాలు రాక, పెన్షన్లకు నోచుకోక, వైద్య సదుపాయాలు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, భూపాలపల్లి బొగ్గు బావుల మీద సభలో సీయం రేవంత్ రెడ్డి ప్రస్తుత మంత్రుల సమక్షంలో, కార్మిక నాయకుల సమక్షంలో, కార్మికుల సమక్షంలో మారుపేర్ల సమస్యను మానవీయ కోణంలో వన్ టైమ్ సెటిల్మెంట్ క్రింద పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ఈ మారు పేర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని సీయం రేవంత్ రెడ్డి ని కోరుతూ పోస్టు కార్డులు పంపడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సీపీ నాయకులు చెన్నూరి నాగరాజు, మొలుగూరి మహేష్, నాగుల శివకుమార్, సుందిళ్ల సూర్య, కుమ్మరి నాగార్జున, సింగరేణి మారుపేర్ల బాదితులు లక్క శ్రావణ్, పాతపల్లి హరీష్, దొమ్మేటి రాజు, బొమ్మక కార్తీక్, వేగోళపు సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు..



**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 27 :** హనుమకొండలోని బాలసముద్రం ప్రజా భవన్ (ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం)లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాలతో క్విట్ ఇండియా, ముల్కీ, తెలంగాణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన స్వాతంత్ర్య సమరయోధుడు, జాతి గర్వించదగ్గ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అల్లుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయాకులు విష్ణు వర్దన్ రెడ్డి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళీలు అర్పించారు. ఈ కార్యాక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బంక సరళ, బ్లాక్ అధ్యక్షులు బంక సంపత్ యాదవ్, అంబేద్కర్ రాజు మాజీ కార్పొరేటర్ అబూ బకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ రజాలి, నాయకులు ఎర్రం మహీందర్, శ్రీకర్, ప్రభాకర్, మల్లరెడ్డి, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం



**తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి: సెప్టెంబర్ 27 :** వరంగల్ లోని భద్రకాళీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానం చైర్మన్ శేషు, ఈవో శేషుభారతి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శ్రీ భద్రకాళీదేవి శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వానాన్ని అందజేసిన ఉత్సవాలకు రావాలని ఆలయ ఈవో, చైర్మన్ కోరారు.

## ఓవర్ లోడుతో పేలిన ఆర్టీసీ బస్ టైర్



**తెలంగాణ వీణ/మనకొండూర్ ప్రతినిధి, సెప్టెంబరు27:** తిమ్మాపూర్, కరీంనగర్ నుండి హుస్నాబాద్ కు వెళ్తున్న ఆర్ టి సి బస్ వెనుక టైర్ నుస్తులాపూర్–కొత్తపెల్లి గ్రామాల మధ్య పేలిపోయింది ఈ బస్సు లో సుమారు వంద మందికి పైగా ప్రయాణికులు ప్రయాణి స్తున్నారని కండక్టర్ తెలిపారు. కేపాసిటి కి మించి ప్రయాణికులు బస్సులో ఎక్కడంతోనే ఈ ప్రమాదం సంభవించినదని అన్నారు. అదే బస్సు యొక్క ముందు టైర్ పేలినట్లైతే ప్రమాదం ఊహించుకోలేమని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కోసం బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## పరకాల పట్టణం డీసీఎం డ్రైవర్ యూనియన్ ఎన్నిక

**తెలంగాణ వీణ/పరకాల, సెప్టెంబర్ 27 :**పరకాల పట్టణంలోని డి సీ ఎం డ్రైవర్ యూనియన్ సభ్యులు శుక్రవారం నూతన అధ్యక్షులుగా సురుగురి రవి ని, ఉపాధ్యక్షులుగా వనపర్తి నవీన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బోయిని శ్రీనివాస్,గౌరవ అధ్యక్షులు ఏకు సాంబయ్య, సురుగురి రామన్న, కోశాధికారులు కొడిమాల రాజేందర్, పురేల్లి తిరుపతి, సహాయ కార్యదర్శి గొడుగు నాగరాజు,సలహాదారులు కిషోర్, దేవేందర్, కుమార్ అజయ్ ఎండి మహబూబ్ ప్రవీణ్ రాజు బాబన్న ను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ డ్రైవర్ వృత్తి అనేది చావుతో పోరాటమని డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకొని నడపాలని మద్యం తాగి ఎవరు కూడా డ్రైవింగ్ చేయవద్దని వారికి సూచించారు. డ్రైవర్లకు ఎలాంటి సమస్యలు వచ్చినా ముందుండి సమస్యను తీర్చుతానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన డ్రైవర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న..

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్టలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కళాశాలలోని విద్యార్థుల హాజరు శాతం, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గురించి ప్రిన్సిపాల్ తెలుసుకున్నారు. కళాకాలలోని తరగతి గదికి వెళ్ళి విద్యార్థుల సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలోని ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులతో విద్యార్థులతో సమావేశమై మీకు ఏమైనా సమస్యలు ఉంటే –చేప్పమని మల్లన్న అడిగారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి. మంజుల మాట్లాడుతు కళాశాలకు రక్షణగా ప్రవారి గోడ కావాలని విద్యార్థులకు మధ్యహ్న భోజనం సదుపాయం కావాలని తెలియజేశారు. విద్యార్థులు తమకు కాళాశాల బస్టాండ్ నుండి కాలేజ్ దూరంగా ఉందని ప్రత్యేక



బస్సు పదుపాయం ఉదయం, సాయత్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమ ంలో ఎన్ ఎస్ ఎస్. అధికారి.



పి.రాంబాబు, అధ్యాప కులు అసహిల్ రాజు, క్రిష్ణ, రమేష్, హైమవతి, ఉలరా ం, నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి అంత నర్సింహ్మ రచిత, నాన్ ఉంచింగ్ సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్లె గల్లాఖాళీ..!!

### - గ్రామ పంచాయతీల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు



**తెలంగాణ వీణ/హైదరాబాద్: సెప్టెంబర్ 27:** గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నెలలుగా పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ముఖ్యంగా ఆదాయ వనరులు అంతగా లేని చిన్న పంచాయతీల్లో కనీసం కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి. గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం– పచ్చదనం, త్వరలో నిర్వహించే బతుకమ్మ, దసరా పండగ సంబరాలకు నిధుల లేమి సమస్యగా మారనుందని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గాడితప్పిన పాలన..**గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం ఫిబ్రవరి 2న ప్రత్యేకాధికారులను నియమించింది. నిధుల లేమి, సిబ్బంది జీతాల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పంచాయతీ పాలన గాడితప్పుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగు కాలువల్లో పూడికతీత, విద్యుత్తు దీపాల ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీలు, ట్రాక్టర్లకు డిజిల్ కొరత ఇలా.. అనేక సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ప్రత్యేకాధికారులు సైతం చేసేదేమీ లేక పంచాయతీలను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**జాడలేని ఎస్ఎఫ్‌సీ నిధులు...** ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు కొద్దిమేర గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమయ్యాయి. వాటితో పంచాయతీ కార్యదర్శులు కొన్ని నెలలుగా నెట్టుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎస్ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) నిధులు సైతం గత కొన్ని నెలలుగా విడుదల కాలేదు. గతంలో సర్పంచులు గ్రామాల్లో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించాల్సి ఉంది. బ్లీచింగ్, వీధిలైట్లు, చేతిపంపుల సామగ్రి కొనుగోలు, పంచాయతీ నిర్వహణ ఖర్చులు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ప్రత్యేకాధికారులు పంచాయతీ పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో పూర్తిస్థాయిలో బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులపై పడటంతో వారు అప్పులు చేసి పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది..

# మా కష్టార్జితం దోచుకోవడం కాదు సంస్థకు రావలసిన 30వేల కోట్ల బకాయిలు చెల్లించాలి: సిఐటీయు

**తెలంగాణ వీణ/గోదావరిఖని, సెప్టెంబర్–27:** జీడీకే, ఓసీపీ5 ఉదయం 7:00 ఏరియా వర్క్ షాప్‌లో 9:00 గంటలకు షిఫ్టులలో ఆరేపల్లి రాజమౌళి అధ్యక్షతన, ద్వారా సమావేశాలు జరిగాయి, ముఖ్యఅతిథిగా హాజరైన మంద నరసింహారావు మాట్లాడుతూ, కార్మికుల కష్టార్జితం సింగరేణి సంస్థకు రావలసిన 30 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని, మా నికర లాభాల్లో నుంచి పక్కకు పెట్టడం కాదు సంస్థ అభివృద్ధి కోసం ఆ బకాయిలు చెల్లిస్తే అనేక ప్రాజెక్టు మేమే పెడతాం, మా బాయ్ బతుకులు బండ కింద బతుకుల గురించి ఏనాడు మా సంక్షేమ కోసం మాట్లాడని ప్రభుత్వాలు, మా రక్తం చెమటగా మార్చి అధిక ఉత్పత్తి చేసి ?4701/– కొట్లు నికర లాభాలు సాధిస్తే, దానిని మసిబూసి మారేడు కాయ చేయటానికి రాష్ట్ర ప్రభుత్వము సింగరేణి యాజమాన్యం కంపెనీ అవసరాలరీత్యా పెట్టుబడుల కోసమని రు. 2289 కోట్ల పక్కకు పెట్టి మిగతా వాటిపై మాత్రమే 33% కార్మికులకు లాభాలు వాటా ప్రకటించటం కార్మికులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. నికర లాభాన్ని స్థూల లాభంగా ఏఐటీయుసీ నాయకులు చెప్పటం వారి అవివేకానికి నిదర్శనమని అన్నారు. గత అనేక సంవత్సరాలుగా నికర లాభం పై కార్మికులకు



లాభాల వాటా ప్రకటిస్తా ఉంటే ఈ సంవత్సరం ప్రతి కార్మికుడికి గత సంవత్సరం వచ్చిన లాభాల కంటే రెండు రెట్లు అధికంగా వచ్చేదని దానిని తగ్గించడానికి. సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం కలిసి చేసిన కుట్రనే ఈ లాభాలను పక్కదారి పట్టించడం తప్ప మరొకటి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యజమాన్యానికి ఏఐటీయుసీ నాయకత్వం ఇలా అంటగాగటం సరైనది కాదని కార్మికులు అన్ని విషయాలను గమనిస్తున్నారని గతంలో కంటే కార్మికులు విద్యావంతులు వివేకులని అన్ని అంశాలను గమనిస్తున్నారని, గత ప్రభుత్వము సింగరేణిని అన్ని విధాల ఆర్థికంగా నష్టం చేసిన విధానాలని ఇప్పుటి ప్రభుత్వం కూడా అదేవిధంగా కొనసాగిస్తే కంపెనీ డబ్బును ఇష్టారాజ్యంగా వాడుకుంటే దానికి సింగరేణి యాజమాన్యం వత్తాసు పలికితే సింగరేణి పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని. కార్మికులందరూ మెలకువతో కంపెనీని కాపాడుకోవడం కొరకు సమయాత్తం కావలసిన అవసరమున్నదని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో అర్జీ1, అధ్యక్ష కార్యదర్శులు ఆరేపల్లి రాజమౌళి, మండే శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు తోట నరహరి రావు, విజయ్ కుమార్, పి శ్రీనివాస్ రావు, బ్రాంచి ఉపాధ్యక్షులు ఎస్కే గౌస్, పెరమండ్ల శ్రీనివాస్, పిట్ కార్యదర్శి ఈదా వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి శ్రీనివాస్, రహీం ఖాన్, ఆడిచర్ల మల్లేశం, నంది నారాయణ, సంతోష్ కుమార్, రవి, బండారి సత్తయ్య, సమ్మయ్య, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహాధర్నా కార్యాచరణకు బిఎంఎస్ పిలుపు...

**తెలంగాణ వీణ/రామగిరి:**శుక్రవారం ఉదయం 11గంటలకు అఖిల భారతీయ కథాన్ మజ్దూర్ సంఘ్ బిఎంఎస్ పిలుపు మేరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించాలని చేసిన నిర్ణయం మేరకు జనరల్ మేనేజర్ కార్యాలయం సెంటినరీ కాలనీ అర్జీ3 ఏరియా మరియు ఎల్పి సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిఎమ్ఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య పాల్గొని మాట్లాడుతూ బొగ్గు గని కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం యూనియన్ కృషి చేస్తుందని,ప్రతి డిమాండ్ ను సత్వరమే పరిష్కరించుటకు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్, భవిష్య నిధి సిఎంపీఫ్ లో జరిగిన రూ.1000 కోట్ల కుంభకోణాన్ని సిబిఐ ద్వారా విచారణ జరిపించి బాధ్యులైన వారిపైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.సంబంధిత సొమ్మును సీఎంపిఫ్ ట్రస్ట్ లో జమ చేయాలి,కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆన్ లైన్ ప్రక్రియను ప్రారంభించుటకు చర్యలు తీసుకోవాలి. సింగరేణిలో సూపర్ స్పెషలిటీ వైద్యశాలలు నిర్మించి, అధునాతనమైన పరికరాలను ఏర్పాటు చేస్తు సూపర్ స్పెషలిటీ వైద్యులను నియమించి, నాణ్యమైన మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. 2023–24 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన వాస్తవ లాభాలు రూ.4701 కోట్లు అందులో 33శాతం రూ.1551.33 కోట్లు పంపిణీ చేయుటకు చర్యలు తీసుకోవాలి. కార్మికులకు ఆదాయ పన్ను సంస్థ, రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించే పన్నుల నుండి సింగరేణి యాజమాన్యం ద్వారా రియంబర్స్ మెంట్ ప్రకటించాలి సంస్థ అభివృద్ధి కొరకు భూములు కోల్పోయిన ప్రభావిత గ్రామాలకు అభివృద్ధి తక్షణమే చర్యలు తీసుకోవాలి. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. సంస్థలో పనిచేస్తున్న ప్రతి కార్మికునికి సొంత ఇంటి కలకొరకు 250 గజాల భూమి 50 లక్షల వడ్డీ లేని రుణం కల్పించుటకు చర్యలు తద్వారా ప్రతి కార్మికునికి సొంతింటి కళ నెరవేర్చాలి. సంస్థలో బదిలీ వర్కర్ జనరల్ మజ్దూర్ డిసిగ్నేషన్ రద్దు చేస్తూ గౌరవప్రదమైన డిజిగ్నేషన్ కల్పించాలి. సంస్థ పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లల కొరకు సీబీస్ఈ పాఠశాలలు ఏర్పాటు చేస్తూ,కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తూ, ప్రైవేట్ కాలేజీల్లో చదువుతున్న పిల్లల కొరకు ఫీజు రీయంబర్సుమెంట్ చెల్లించాలి, సింగరేణి నిధులతో సివిల్, గ్రూప్స లాంటి పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్ పెట్టాలి. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు కొత్త పింఛను విధానం 15,000/– రూ చెల్లించాలి. కాంట్రాక్టు కార్మికులకు, 8గంటలు డ్యూటీ ఉద్యోగ భద్రత, ఏర్పాటు చేయాలి,సేఫ్టీ కమిటి ఏర్పాటు చెయ్యాలన్నారు. పర్సనల్ మేనేజర్ ఆర్జి3 శ్రీహరి కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. పాల్గొన్న నాయకులు పొన్నమనేని వేణుగోపాలరావు డిప్యూటీ ప్రధాన కార్యదర్శి,మాదాసి రవీందర్ కేంద్ర కార్యదర్శి,ఏరియా ఉపాధ్యక్షులు అరుకాల ప్రసాద్,రౌతు రమేష్ ఏరియా కార్యదర్శి,ఎర్రవెల్లి రాణి మహిళా సభ్యురాలు,గోగుల విద్యాసాగర్, మామిడి స్వామి,గట్టు శ్రీనివాస్,పాల్గొన్నారు.



శనివారం 28 సెప్టెంబర్ 2024

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం...

హైదరాబాద్

# తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కేంద్ర బిజెపి ప్రభుత్వం చేపిస్తున్న కుట్రపూరిత ఈడి దాడులను తెలంగాణ విద్యార్థుల పక్షాన ఖండిస్తున్నాం

**- వలిగొండ నరసింహ ఓయూ విద్యార్థి నాయకుడు**

**తెలంగాణ వీణ/ఓయూ:** ప్రజా నాయకుడు నిరుపేదల ఆత్మబంధువు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీద,కాంగ్రెస్ ప్రజా పాలనలో సజావుగా సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి ,ప్రజల్ని తప్పుదోవ పట్టించి తెలంగాణలో భయభ్రాంతులు,అలజడులు సృష్టించడానికి కుట్రతో ,కక్షపూరితంగా మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద కేంద్ర బిజెపి ప్రభుత్వం ఈ డి దాడులు చేపిస్తుంది అని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి



నాయకుడు వలిగొండ నరసింహ అన్నారు, ప్రజాసేవలో నిరంతరంఉంటూ , ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల హృదయాల్లో శీనన్నగా పేరుగాంచిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద కేంద్ర బిజెపి ప్రభుత్వ కక్షపూరిత దాడులను,తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై మోడీ షా ల కుట్ర రాజకీయాలని ఎదురుకోవడానికి ఎంతో చైతన్యవంతమైన తెలంగాణ విద్యార్థి సమాజం సిద్ధంగా ఉందని హెచ్చరిస్తున్నాం అని అన్నారు.

---

# కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం బావి తరాలకు ఆదర్శం: కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

**తెలంగాణవీణ/కూకట్ పల్లి:** స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ కోసం, ఇలా మూడు దశల ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించి, దేశసేవకు అంకితమైన వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతి సందర్భంగా,ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని, ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ,ఆల్విన్ కాలనీ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై, బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం భావి తరాలకు ఆదర్శనీయం అని అన్నారు.



తెలంగాణ సాధనతో పాటు బడుగు బలహీన వర్గాల కోసం ఆయన జీవితాంతం పోరాడారు అని గుర్తుచేశారు. దేశంలో బాపూజీ అని గౌరవం దక్కిన రెండో వ్యక్తి, మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలి, తెలంగాణ త్యాగశీలుల్లో ప్రథమంగా నిలిచే వ్యక్తి బాపూజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుబిడి సూపర్వైజర్ నాగ రాణి, జిల్లా గణేష్, ఆల్విన్ కాలనీ ఫేస్ 1 అధ్యక్షులు బి.వెంకటేష్ గౌడ్, మాజీ అధ్యక్షులు అంజిరెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షులు బిక్షమయ్య, గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు, నరసింగరావు, అశోక్, ప్రకాష్, వెంకట్ నరసింహారావు, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

---

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయండి: సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీ నివాస్

**తెలంగాణ వీణ/ఓయూ:** సికింద్రాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పైన సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాంటెస్ట్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ని కలిసి నియోజకవర్గంలోని పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కోరారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజలు మంచినీటి, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మౌలిక సదుపాయాల సమస్యలతో ప్రజలు నిరంతరం సతమతమవుతున్నారని అదేవిధంగా నిధుల కొరతతో పెండింగ్లో ఉన్న అడ్డగుట్ట, లాలపెట్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లను మరియు దుద్ బావి, సాయి నగర్ లోని డబల్ బెడ్ రూమ్ లను యుద్ధ పాతికన నిర్మాణం పూర్తి చేసి



త్వరగా లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలని కోరారు.దాదాపుగా డబల్ బెడ్ రూమ్ల కొరకై నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తూ కిరాయి ఇండ్లలో ఉంటూ కిరాయిలు కట్టలేక అనేక అవస్థలు పడుతున్నారు, ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు.పై అంశాల పైన ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఆదం సంతోష్ కుమార్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో..సిపిఐ సికింద్రాబాద్ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

---

# అర్హులైన ప్రతి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

**- టియుడబ్ల్యూ జే (ఐజేయు) మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డిమీది బాలరాజు**

**తెలంగాణ వీణ, మల్కాజ్గిరి:** నియోజకవర్గంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల పట్టాలు ఇప్పించడానికి కృషి చేస్తామని టి యు డబ్ల్యు జే (ఐజేయు )మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డిమీది బాలరాజు తెలిపారు. శుక్రవారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలో ఆనంద్ బాగ్ లోని వెంకటేశ్వర ప్లాజాలో మల్కాజిగిరి నియోజకవర్గం టి యు డబ్ల్యూజె (ఐజేయు ప్రధాన కార్యదర్శి)మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన మల్కాజ్గిరి, అల్వాల్ జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు వెంకట్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీద బాలరాజ్, ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటేష్, బిక్షపతి, బాలరాజ్ , రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గడ్డిమీది బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన గైడ్లైన్స్ ప్రకారం నియోజకవర్గంలో




ఐదు సంవత్సరాలు అనుభవం ఉండి , అర్హులుగా ఉన్న ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలుపెట్టామన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉండడంతో, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల పట్టాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఇళ్ల పట్టాలతో పాటు జర్నలిస్ట్ ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డితో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోనే ప్రతి జర్నలిస్టు తమ దరఖాస్తు ను అందజేయాలని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ యూనియన్లకు అతీతంగా ప్రతి జర్నలిస్టు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జర్నలిస్టులకు సూచించారు. ఇళ్ల పట్టాల కోసం తాము సేకరించిన దరఖాస్తులను ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఇళ్ల స్థలాల కోసం యూనియన్ ద్వారా దరఖాస్తు చేసుకునేవారు ఒకవేళ ఏదైనా జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యులుగా ఉంటే వాటిని రద్దు చేసుకోవడం మంచిదన్నారు.మల్కాజిగిరి ఐజేయు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, మల్కాజ్గిరి అల్వాల్ జర్నలిస్టులు పాల్గొన్నారు

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: చైర్మన్ కౌకుంట్ల చంద్రరెడ్డి

**తెలంగాణవీణ, కీసర:** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా గుర్తించుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వరల్డ్ టూరిస్ట్ డే లో భాగంగా శిల్ప నగర్ పార్కులోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకుంటూ స్వచ్ఛతకు సహకరించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 6 వ వార్డులోని శిల్పా నగర్ కాలనీలో పార్కు నందు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జి.రాజేంద్ర కుమార్, ఆరవ వార్డు కౌన్సిలర్ కౌకుట్ల అనంతరెడ్డి, 14 వ వార్డ్ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వేడుకలు



**తెలంగాణ వీణ/హైదారాబాద్:** స్వాతంత్ర సమరయోధుడు పద్మశాలి ముద్దుబిడ్డ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలలో తెలంగాణా లోని అన్ని జిల్లాలలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్దిపేటలో రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మాజి మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, తెలంగానా పద్మశాలి సంఘం రాష్ట్ర కన్వీనర్ బూర మల్లేశం మాట్లాడుతూ పద్మశలి ల కోసం చేసిన ఘనత హరీశ్ కు ఎంతైనా ఉందని, హక్కుల సాధన కోసం పోరాడుతామని హామీ ఇచ్చారు.అన్ని మండలాల పద్మశలీల కు రుణమాఫీ ,పింఛన్లు త్రిబుల్ ఫండ్, పెండింగ్ లో ఉన్న బకాయిలను ఇప్పించడం జరిగిందన్నారు.సిద్దిపేట జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు డా. కస్తూరి సతీష్ సిద్దిపేట పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కాముని రాజేశం లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# బిజానగర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ వేడుకలు



తెలంగాణా వీణ/హైదారాబాద్: మేడ్చల్ జిల్లా లోని బిజా నగర్ మున్సిపల్ కార్పొరేన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యం లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాన్ని ఘనంగా జరుపు కున్నారు.మున్సిపల్ మేయర్.కార్పొరేటర్లు. మాజీ సర్పచ్ లు, పద్మశాలి సంఘం అధ్యక్షులు పుప్పల పల్లి కమలాకర్ మాట్లా డుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరిచిపోరాదని, ఆయ న అడుగు జాడల్లో నడవాలన్నారు. సభ్యులు పాల్గొని ఆయన చిత్ర పటానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు.

# కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి

## నివాళులు బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు



**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** మల్కాజ్గిరి బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109 జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మౌలాలి డివిజన్ భరత నగర్ చౌరస్తా బీసీ భవన్ లో బాపూజీ చిత్రపటానికి బీసీ నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన తెలంగాణ కోసం చేసిన త్యాగాలను స్మరించుకొని ఆయన ఆశయాలను భవిష్యత్తులో తరాలవారికి తెలిసే విధంగా పనిచేయాలని తెలిపారు. నివాళులర్పించిన మల్కాజ్గిరి బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పద్మశాలి కుల బాంధవుడు పిట్టల శ్రీనివాస్, సీనియర్ నాయకులు బత్తిని నరసింహ గౌడ్, సంపత్ గోపాల్ , బాలరాజు , సుధాకర్ , వంశీ నేత , నరేందర్, పిట్టల నాగరాజ్ ,మంద భాస్కర్ , వెంకటేష్ నేత ,ఆంజనేయులు సాంబరాజు ,సత్యనారాయణ అజీజ్ పాషా బీసీ నాయకులు పెద్దలు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నృసింహా స్వామి కొండపై కూచిపూడి నాట్య ప్రదర్శన..

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:**యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన ప్రాంగణంలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహి ంచారు. కావ్యాంజలి డ్యాన్స్ అకాడమి హైదరాబాద్ బృందం చే నృత్యా ప్రదర్శన,కావ్య శ్రీ,,సరిత ప్రవీణ్ బృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆహూతులను అలరించారు..



తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
జనరల్
శనివారం 28 సెప్టెంబర్ 2024

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ...



**తెలంగాణవీణ/కీసర:** నాగారం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రరెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్ళర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జి. రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు కౌకుట్ల అనంతరెడ్డి, బిజ్జ శ్రీనివాస్ గౌడ్ , మున్సిపల్ మేనేజర్ కే.చంద్రశేఖర్, పట్టణ నాయకులు ఆంజనేయులు గౌడ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## యాదాద్రి లాడ్జీల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఏసిపి రమేష్ కుమార్..



**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట లో లడ్జీలకు వచ్చే వారి పూర్తి వివరాలు,సీసీ కెమెరాల పనితీరు సరిగ్గా ఉండాలి నిర్వాహకులకు ఆదేశించిన ఏసిపి రమేష్ కుమార్.. రోజు వారి రూములు అద్దెకు ఇచ్చే యజమానులు,నిర్వహకులతో ఏసిపి రమేష్ కుమార్,సీఐ రమేష్ సమావేశం నిర్వహించారు. లాడ్జిల నిబంధనలు పాటించాలని, ఏ మాత్రం అనుమానం కలిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య




**తెలంగాణ వీణ/యాదగిరి గుట్ట:** యాదగిరిగుట్ట పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జే వై ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ,పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ సమాజాన్ని చికట్లో నుండి వెలుగులోకి తెచ్చే ఉపాధ్యాయులను సన్మానించడం నాకు నిజంగా అదృష్టంగా ఉందన్నారు.కరిగే కొవ్వత్తులాగా ఉపాధ్యాయిలు తమ విజ్ఞానాన్ని పంచి సమాజానికి వెలుగులు అందిస్తున్నారని .నేటి విధ్యా విదానంలో విద్యార్థులకు మీలాంటి ఉపాద్యాయిలు మార్గదర్శనం ఎంతో అవసరమన్నారు.తల్లి తండ్రిల తర్వాత అంతటి గౌరవం సమాజం ఉపాద్యాయులకు ఇచ్చింది. తలరాతలు రాసేది బ్రహ్మ అయితే మ ఒడి రాతలు రాయించి భవిష్యత్ కి బంగారు బాటలు వేసేది ఉపాద్యాయులన్నారు.



## గోషామహల్‌లో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ కుమార్ గౌడ్ పాదయాత్ర...







**తెలంగాణవీణ/హైదరాబాద్:** గోషామహల్ నియోజకవర్గం జాంబగ్ డివిజన్ , గన్ ఫౌండ్రి డివిజన్ లలో గోషామహల్ బిఆర్ఎస్ నాయకుడు ఎమ్ ఆనంద్ కుమార్ గౌడ్ పాదయాత్ర చేశారు. గత కొన్ని రోజులుగా ఈ డివిజన్ లలో సివారేజ్, పొల్యూషన్ సమస్యలు , వాటర్ రాకపోవడం , స్థానికులు పలు సమస్యలను ఆనంద్ గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో శుక్రవారం వాటర్ వర్క్స్ హిందీ నగర్ మేనేజర్ కులశేకర్ తో పాదయాత్ర చేశారు. గౌలి గూడ , నకాశ్ గల్లీ , రాంమందిర్ వెనుకాల , బాశెట్టి గల్లీ , ఇడ్లి గల్లీ , సుధ మెడికల్ హాల్ లైన్ , జాంబగ్ , పూసల బస్తి లలో పాదయాత్ర చేస్తూ , సమస్యలను వాటర్ వర్క్స్ మేనేజర్ గారి దృష్టికి తీసుకెళ్లారు. గెలిచిన కార్పొరేటర్లు పట్టించుకోవడం లేదని , బస్తి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలనీ, తాను మూడుసార్లు ఓడినా తాను ఎప్పుడు ప్రజల మధ్యలోనే ఉన్నానని , ఓట్లు వేసే సమయంలో ప్రజలు పని చేసే వారికి ఓటు వేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తాను ఓడిన బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొన్ని కోట్ల రూపాయల పనులు చేయించిన ఘనత తనకు దక్కుతుందన్నారు. ఏ సమస్య ఉన్న కూడా తన దృష్టికి తీసుకువస్తే , అధికారులతో మాట్లాడి పనులు చేయిస్తాన్నన్నారు. రానున్న బల్దియా ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. గెలిచిన వాళ్ళు ఎక్కడ ఉన్నారో కూడా తెలియడం లేదన్నారు. 24 గంటలు ప్రజలకు తాను అందుబాటులో ఉంటున్నాననీ, రానున్న బల్దియా ఎన్నికల్లో పని చేసే వారికి పట్టం కట్టాలని కోరారు. తన ఊపిరి ఉన్నంత వరకు గోషామహల్ ప్రజల సేవ కోసం పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బస్తి ప్రజలు మహేష్ వర్మ , వి గణేష్ , హెచ్ బాలాజీ , టి విజయ్ కుమార్ , సురేష్ , డి నరేష్ , భాస్కర్ జ్ సోనీ , మూర్తి , డి శ్రీనివాస్ రావు , ఆన్మోల్ సింగ్ , జోగేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రిలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి





**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** దేశ సేవకు అంకితమై తెలంగాణ స్వయంపాలన కోసం, ఆత్మగౌరవం కోసం పోరాటాలు నడిపిన తొలితరం ఉద్యమాలకు ఊపిరి కొండా లక్ష్మణ్ బాపూజీ యాదగిరిగుట్ట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన మున్సిపల్ ఛైర్మన్ పట్టణ పద్మశాలి కులభందవులు.మరియు పట్టణ బహుజన నాయకులు పాల్గొన్నారు.కొండ లక్ష్మణ్ బాపూజీ మహనీయుడని మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేశారని మున్సిపల్ ఛైర్మన్ ఎరుకల సుధాహేమెందర్ గౌడ్ అన్నారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారని కొనియాడారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ జయంతి సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ ఎరుకల సుధాహేమెందర్ గౌడ్ భాపూజిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బహుభాషా కోవిదుడైన బాపూజీ జీవితాంతం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని పేర్కొన్నారు.స్వాతంత్ర్య సమరయోధుడుగా, అనంతర కాలంలో తెలంగాణ స్వయంపాలన కోసం, ఆత్మగౌరవం కోసం పోరాటాలు నడిపిన తొలితరం ఉద్యమనేతగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి అజరామరమని అన్నారు. రాజకీయవేత్తగా తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు బాపూజీ నడిపిన రాజీలేని పోరాటాలు తెలంగాణ సోయి కలిగిన ప్రతి ఒకరికీ ఆదర్శనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భందరపు బిక్షపతి గౌడ్,సింగిల్ విండో వైస్ ఛైర్మన్ కటబత్తిని ఆంజనేయులు నేత,,మాజీ ఉపసర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్,పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ గౌడ్.టీడీపి పట్టణ అధ్యక్షులు మచ్చ నరసింహ గౌడ్,మాజీ సర్పంచ్ శ్రీరామ్ మూర్తి, కూరగాయల కృష్ణ,, గుండు వెంకటేష్ గౌడ్,రమేష్ గాంధీ,తదితరులు పాల్గొన్నారు.

## కొండ లక్షమన్ బాపూజీ జయంతి వేడుకలు వాడ వాడలా ఘనంగా నిర్విహిద్దాం

### - ఆ మహనీయున్నీ స్మరించుకునేల పెద్ద ఎత్తున కార్య క్రమాలు నిర్వహించాలని పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి దీకొండ వెంకటేష్

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు తెలంగాణ ఉద్యమ నేత ఆచార్యకొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని యాదగిరిగుట్ట పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి దీకొండ వెంకటేష్ అన్నారు ఆయన జయంతి వేడుకలు గ్రామ గ్రామాన వాడవాడల ఘనంగా నిర్వహించారు ఆయన జయంతి కార్యక్రమంలో అందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఆయన సేవలను స్మరించుకొని బాపూజీ చూపిన దారిలో ముందుకు సాగుతూ ఆయన ఆశయాలు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు తెలంగాణ కోసం నిరంతరం పరితపించిన మహా నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు బాపూజీ చూపిన మార్గం నేటికీ ఆదర్శం అని అన్నారు కొండా లక్ష్మణ్ బాపూజీ నిరంతరం దేశం కోసం తెలం గాణ రాష్ట్రం కోసం పరితపించారని అన్నారు స్వాతంత్ర సమరయోధుడిగా తెలంగాణ ఉద్యమకారుడిగా ఆయన చరిత్రలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు యాదగిరిగుట్ట లో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ప్రజలంతా జయంతి వేడుకల్లో పాల్గొని ఆయనచేసిన సేవలను ఆయన జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అని అన్నారు ముఖ్యంగా నేటి యువత ఆయన నుండి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది అని అన్నారుద.





## అభివృద్ధి పనులకు భూమి పూజ: మంథని చైర్ పర్సన్

**తెలంగాణ వీణ/మంథని, సెప్టెంబర్-27:** మంథని మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు, మంథని మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా 5వ వార్డులో ఒక కోటి రూపాయల అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రీ రమా స్థానిక 5వ వార్డ్ కౌన్సిలర్ నక్క నాగేంద్ర శంకర్ కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించినారు. 9వవార్డు కౌన్సిలర్ చొప్పకట్ల హనుమంత్, 1వవార్డ్ కౌన్సిలర్ గుండా విజయలక్ష్మి పాపారావు, 11వవార్డ్ కౌన్సిలర్ వీకే రవి, 4వవార్డ్ కౌన్సిలర్ కుర్ర లింగయ్య, 5వవార్డ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబటి సత్యనారాయణ, మాదేశి పద్మ, నాగెల్లి జానీ,గడ్డం శంకర్ మాదేశి శ్రావణ్ కుమార్, మిట్టపల్లి కిషోర్,నాగెల్లి మహేష్, నక్కఅశోక్ లు మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

6 9 TV తెలుగు
తెలంగాణ వీణ
For Advertisements
8328209811
Flat No 204,
Mythri Appartments,
Opp BSNL Office, ECIL



# కుంబ్లే ఆల్‌టైమ్ రికార్డు అశ్విన్ బ్రేక్

కాన్పూర్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అరుదైన ఘనత సాధించాడు. ఆసియాలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా చరిత్రకెక్కాడు. బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో (27బీ 67 బంతుల్లో, 4 ఫోర్లు)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకొని ఈ ఘనత అందుకున్నాడు. అంపైర్ ఔట్ ఇవ్వడంతో బంగ్లా కెప్టెన్ షాంటో రివ్యూకి వెళ్లాడు. సమీక్షలో కూడా ఎల్బీడబ్ల్యూగా ఫలితం తేలింది. వికెట్ల ముందు షాంటో దొరికిపోయినట్లు రిప్లేలో స్పష్టంగా కనిపించింది. అయితే ప్యాడ్‌కు బంతి తగలకుండా ఇన్‌సైడ్ ఎడ్జ్ తీసుకున్నా షాంటో ఔటయ్యేవాడు. ఎలా అంటే.. ప్యాడ్లకు తాకిన బంతిని సెకండ్ స్లిప్‌లో ఉన్న గిల్ డైవ్ చేస్తూ క్యాచ్ అందుకున్నాడు. మొత్తంగా బంగ్లాదేశ్ రివ్యూని కోల్పోయింది. ఈ క్రమంలో ఆసియాలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అశ్విన్ చరిత్ర సృష్టించాడు. అంతకుముందు ఈ రికార్డు అనిల్ కుంబ్లే పేరిట ఉంది. కాగా, ఓవరాల్‌గా ఆసియాలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ ముత్తయ్య మురళీధరన్. ఆసియాలో ఈ లంక దిగ్గజ స్పిన్నర్ 612 వికెట్లు పడగొట్టాడు. అశ్విన్ 420, కుంబ్లే 419 వికెట్లతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో రంగన హెరత్ (354), హర్భజన్ సింగ్ (300) ఉన్నారు. కాగా, టాస్ ఓడి బ్యాటింగ్ చేస్తున్న బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. అయితే వెలుతురులేమి కారణంగా మ్యాచ్‌ను అంపైర్లు నిలిపివేశారు. వర్షం పడే సూచనలు ఉండటంతో మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచారు. ఇవాళ తడి ఔట్ ఫీల్డ్, వెలుతురు లేమి కారణాలతో ఆటకు అంతరాయం కలుగుతోంది. ప్రస్తుతం ముష్ఫికర్ రహీమ్ (6), మోమినుల్ హక్ (40) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు, అశ్విన్ ఒక వికెట్ తీశారు.

# ఆకాశ్‌దీప్ పనికి షాకైన రోహిత్



భారత్-బంగ్లాదేశ్మధ్య రెండో టెస్ట్ మొదలైంది. కాన్పూర్?లోని గ్రీన్ పార్క్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్?లో టాస్ నెగ్గిన టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. ముందు రోజు వర్షం పడటంతో బౌలర్లకు పిచ్ నుంచి హెల్ప్ దొరుకుతుందనే ఉద్దేశంతో అతడు బౌలింగ్?కు వెళ్లాడు. చెన్నై టెస్ట్?లో ఆడిన జట్టునే సెకండ్ టెస్ట్?కూ కంటిన్యూ చేశాడు. వికెట్? స్పిన్?కు అనుకూలిస్తుందనే వార్తల నేపథ్యంలో ముగ్గురు స్పిన్నర్లను ఆడిస్తారేమోనని అంతా అనుకున్నారు. కానీ హిట్?మ్యాన్ మాత్రం అదే జట్టుతో బరిలోకి దిగాడు. అయితే బౌలింగ్ టైమ్?లో పేసర్ ఆకాశ్?దీప్ చేసిన ఓ పనికి రోహిత్ షాక్ అయ్యాడు. అసలేం జరిగిందో ఇప్పుడు తెలుసుకుందాం.. ఫస్ట్ బ్యాటింగ్?కు దిగిన బంగ్లాదేశ్?కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ జాకీర్ హుస్సేన్? (0)ను ఆకాశ్? దీప్ ఔట్ చేశాడు. అతడి బౌలింగ్?లో యశస్వి జైస్వాల్?కు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు జాకీర్. ఆ తర్వాత నాలుగు ఓవర్ల గ్యాప్?లో షాద్మన్ ఇస్లాం (24)ను పెవిలియన్?కు పంపించాడు ఆకాశ్?దీప్. అతడు వేసిన బాల్ గుడ్ లెంగ్త్?లో పడి కాస్త స్వింగ్ అయి లోపలకు దూసుకొచ్చింది. ఆ డెలివరీని డిఫెన్స్ చేయడంలో షాద్మన్ ఫెయిల్ అయ్యాడు. అతడి ప్యాడ్స్?కు తగిలింది బాల్. దీంతో ఆకాశ్?దీప్ సహా ఇతర భారత ఆటగాళ్లు గట్టిగా అప్పీల్ చేశారు. అయితే రోహిత్ మాత్రం అది నాటౌట్ అనుకున్నాడు. బాల్ లెగ్ స్టంప్?ను మిస్ అవుతోందని భావించి డీఆర్ ఎస్ తీసుకోవడానికి నిరాకరించాడు. అయితే ఆకాశ్? దీప్ మాత్రం రివ్యూ తీసుకోవాల్సిందేనని అతడ్ని కన్విన్స్ చేశాడు. బాల్ స్టంప్స్ మిస్ అయి వెళ్తున్నట్లు కనిపించడంతో డీఆర్ఎస్ అక్కర్లేదు.. రివ్యూ వేస్ట్ అవుతుందని రోహిత్అనుకున్నాడు. కానీ ఆకాశ్?దీప్ మాత్రం అది క్లియర్ ఔట్, డీఆర్ఎస్ తీసుకోమంటూ హిట్?మ్యాన్?ను ఒప్పించాడు. దీంతో రివ్యూ తీసుకోగా.. షాద్మన్ ఎల్బీడబ్ల్యూ అని తేలింది. దీంతో హిట్?మ్యాన్ బిత్తరపోయాడు. భలే వికెట్ దొరికిందని సంతోషంలో మునిగిపోయాడు. తొలుత రివ్యూ తీసుకోమంటూ ఆకాశ్? ఒత్తిడి చేయడంతో సీరియస్ అయిన రోహిత్.. ఆ తర్వాత వికెట్ రావడంతో అతడి పనికి షాక్ అయ్యాడు. సీనియర్ అయిన తమ కంటే అతడు రివ్యూను కరెక్ట్?గా జడ్జ్ చేయడంతో హ్యాపీ ఫీల్ అయ్యాడు. అందుకు ఆకాశ్?ను మెచ్చుకున్నాడు. ఈ వీడియో చూసిన నెటిజన్స్ జూనియర్ షమి అంటే అలాగే ఉంటుందని అంటున్నారు. ఇక, ఈ మ్యాచ్? తొలి రోజు ముగిసేసరికి బంగ్లాదేశ్ 3 వికెట్లకు 107 రన్స్ చేసింది. మోమినుల్ హక్ (40 నాటౌట్), ముష్ఫికర్ రహీం (6 నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఎడతెరపిలేనివర్షం కారణంగా తొలి రోజు ఆటను నిలిపివేశారు.



# జడేజా ప్రపంచ రికార్డు

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టు క్రికెట్‌లో అత్యంత అరుదైన ఘనత సాధించాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు సందర్భంగా ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక రెండో టెస్టులో మరొక వికెట్ తీస్తే చాలు.. మరో ఎలైట్ జాబితాలోనూ చోటు దక్కించుకుంటాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2023ు25 సీజన్‌లో భాగంగా టీమిండియా బంగ్లాదేశ్‌తో రెండు మ్యాచ్‌ల సిరీస్ ఆడుతోంది. ఈ క్రమంలో చెన్నైలో జరిగిన తొలి టెస్టులో రోహిత్ సేన.. నజ్ముల్ షాంటో బృందాన్ని 280 పరుగుల తేడాతో చిత్తు చేసింది. సమష్టి ప్రదర్శనతో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించింది. ఇక ఈ మ్యాచ్‌లో భారత స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ జడేజా.. 86 పరుగులు చేయడంతో పాటు.. ఐదు వికెట్లు పడగొట్టాడు. తద్వారా టీమిండియా విజయంలో తన వంతు పాత్ర పోషించి.. ఓ రేర్ ఫీట్ నమోదు చేశాడు. తన జట్టు టెస్టుల్లో గెలిచిన సందర్భాల్లో 2 వేలకు పైగా పరుగులు సాధించడంతో పాటు.. 200కు పైగా వికెట్లు తీసిన తొలి క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు. 147 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో ఓ ఆటగాడు ఈ ఘనత సాధించడం ఇదే తొలిసారి. టీమిండియా గెలిచిన సందర్భాల్లో ఇప్పటి వరకు జడ్డూ 2003 రన్స్ చేశాడు. అంతేకాదు 218 వికెట్లు కూడా పడగొట్టాడు. ఈ జాబితాలో రవిచంద్రన్ అశ్విన్ (1943 రన్స్, 369 వికెట్లు) జడ్డూ తర్వాతి స్థానాన్ని ఆక్రమించాడు.

# బంగ్లా అభిమానిపై దాడి..!

భారత్-బంగ్లాదేశ్ మధ్య రెండు టెస్టు మ్యాచ్ కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ స్టేడియంలో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. కాగా.. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు జరగడంతో క్రికెట్ జట్టు ఆటగాళ్లకు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే మ్యాచ్‌కు వ్యతిరేకంగా వీహెచ్‌పీ బంగ్లాదేశ్ జెండాను దహనం చేసి రచ్చ చేశారు.మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చిన బంగ్లా వీరాభిమాని టైగర్ రాబీపై కొందరు దాడి చేశారు. దీంతో.. పోలీసులు అతడిని ఆస్పత్రిలో చేర్చారు. ఈ క్రమంలో.. టైగర్ రాబీ స్టార్ స్పోర్ట్స్‌తో, 'నా వెనుక, దిగువ పొత్తికడుపుపై కొట్టారు. ఊపిరి పీల్చుకోలేకపోతున్నాను' అని చెప్పాడు. అయి తే.. స్టేడియంలో ఉన్న పోలీసులు ఈ దాడి ఆరోపణలను ఖండించారు. 'మా అధికారి ఒకరు సి బ్లాక్‌లోని ప్రవేశ ద్వారం దగ్గర ఒక వ్యక్తి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటం చూశాడు, అది డీహైడ్రేషన్ కేసు. అయితే మేము వైద్యుల వివరా లు వెల్లడి కోసంవేచి ఉంటాము' అని పోలీసు వర్గాలు తెలిపాయి.



# సీఎస్‌కే సంచలన నిర్ణయం..

### - రిటెన్షన్ లిస్ట్‌లో ధోని పేరు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 మెగా వేలానికి సంబంధించిన రిటెన్షన్ పాలసీని బీసీసీఐ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఓ ఫ్రాంచైజీ గరిష్టంగా ఐదుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకునే అవకాశం ఉందని సమాచారం. రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎమ్) ఆప్షన్ ఈసారి లేదట. మరికొన్ని గంటల్లో దీనిపై అధికారిక ప్రకటన రానుంది. ఐదుగురితో కూడిన రిటెన్షన్ లిస్ట్‌ను అన్ని జట్లు సిద్ధం చేసినట్లు సమాచారం. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కూడా తమ లిస్ట్‌ను రెడీ చేసినట్లు తెలుస్తోంది. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ విషయంలో సీఎస్‌కే ఫ్రాంచైజీ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2025కు ధోనీ అందుబాటులో ఉంటాడా? లేదా? అనే విషయంపై ఫ్రాంచైజీకి క్లారిటీ లేకున్నా.. రిటెన్షన్ లిస్ట్ సిద్ధం చేసిందట. ధోనీ పేరు లిస్టులో ఉందట. ఐపీఎల్ 2025లో మహీ ఆడుతాడని సీఎస్‌కే నమ్మకంగా ఉందట. అందుకే అతడి పేరును రిటెన్షన్ లిస్ట్‌లో చేర్చినట్లు సమాచారం. రిటైర్మెంట్ ప్రకటించి 5 ఏళ్లు పూర్తవ్వడంతో.. ధోనీని తక్కువ మొత్తానికి రిటైన్ చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఎంఎస్ ధోనీ సహా కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, పేసర్ మతీష పతిరనా, ఆల్‌రౌండర్ శివమ్ దూబేలను సీఎస్‌కే రిటైన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్రలు కూడా చెన్నైకి కీలక ప్లేయర్స్ అన్న విషయం తెలిసిందే. వీరిని వేలంలో తిరిగి దక్కించుకోవాలని చూస్తోందట. ఒకవేళ ధోనీ ఆడకుంటే.. అతడి స్థానంలో కాన్వేను వికెట్ కీపర్‌గా కొనసాగించనుంది. త్వరలోనే ఈ విషయంపై క్లారిటీ రానుంది.



# బడిసె వీరుడిపై పూల వర్షం..

# బ్యాండుమేళంతో ఘన స్వాగతం..

పారిస్ ఒలింపిక్స్‌లో రజతంతో మెరిసిన నీరజ్ చోప్రా ఎట్టకేలకు స్వదేశం వచ్చాడు. విశ్వ క్రీడల్లో వరుసగా రెండు పతకాలతో చరిత్ర సృష్టించిన బడిసె వీరుడు రెండు నెలల తర్వాత స్వరాష్ట్రం చేరుకున్నాడు. పారిస్‌లో భారత జెండాను రెపరెపలాడించిన నీరజ్‌కు సొంతగడ్డపై అపూర్వ స్వాగతం లభించింది. వస్తూ వస్తూనే నీరజ్ యువతరంతో ముచ్చటించేందుకు హర్యానాలోని స్పోర్ట్స్ యూనివర్సిటీకి అతిథిగా వెళ్లాడు.ఇంకేముంది. ఒలింపిక్ యోధువీరుడిపై పూల వర్షం కురిపించారు అక్కడివాళ్లు. అంతేకాదు.. డోలుబాజా, సన్నాయి వాయిద్యాలతో నీరజ్‌ను ఘనంగా ఆహ్వానించారు. గుర్రపు స్వారీ చేస్తూ కొందరు ముందు వెళ్లగా.. ఆ వెనకాలే బ్యాండు మేళం వాయిస్తూ కొందరు నడిచారు. వాళ్ల వెనకాల నీరజ్ వస్తూ ఉండగా గులాబీ పూల రెమ్మల్ని చల్లుతూ వీరుడా నీకు స్వాగతం అంటూ ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. విశ్వ క్రీడల విజేతకు దక్కిన అబ్బురపరిచే స్వాగతానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది.




GS9TV తెలుగు

తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న


GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు

అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు

8328209811
9703024024




# దేవర విడుదలతో ఎన్టీఆర్ జోష్

## - అభిమానులకు ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహించిన చిత్రం 'దేవర'. జాన్వీకపూర్, సైఫ్అలీఖాన్ కీలక పాత్రలు పోషించారు. ఎన్నో అంచనాల మధ్య ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈనేపథ్యంలోనే 'దేవర' రిలీజ్‌ను పురస్కరించుకొని సినీ ప్రియులు, అభిమానులను ఉద్దేశించి ఎక్స్ (ట్విటర్) వేదికగా ఎన్టీఆర్ పోస్ట్ పెట్టారు. తాను ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న రోజు వచ్చిందని పేర్కొన్నారు. అభిమానులు చూపించే ప్రేమకు ఎప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. మా సినిమాపై మీరు చూపిస్తోన్న అభిమానాన్ని చూసి చాలా సంతోషంగా ఉంది. అద్భుతమైన డ్రామా, భావోద్వేగాలతో 'దేవర' తీర్చిదిద్దినందుకు థ్యాంక్యూ కొరటాల శివ. మై బ్రదర్ అనిరుధ్.. నీ మ్యూజిక్‌తో మా ప్రపంచానికి ప్రాణం పోశావు. ఈ చిత్రానికి బలమైన సపోర్ట్‌గా నిలిచిన మా నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె, అద్భుతంగా వర్క్ చేసిన సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, సాబు సిరిల్‌తోపాటు టెక్నీషియన్స్ అందరికీ కృతజ్ఞతలు. నా అభిమానుల వేడుకలు చూసి నా మనసు నిండింది. మీ ప్రేమాభిమానాలకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటా. నాలానే మీరూ ఈ చిత్రాన్ని ఎంజాయ్ చేయడం చూస్తుంటే సంతోషంగా ఉంది. మీకు మరెంతో వినోదాన్ని అందిస్తానని మాటిస్తున్నా అని ఎన్టీఆర్ పేర్కొన్నారు.

# సముద్రతీరం నేపథ్యం...ఆధిపత్యం పోరాటం

## - కలగలిపి దేవర మూవీని వండిన కొరటాల శివ



జూనియర్ ఎన్టీఆర్, కొరటాల శివది క్రేజీ కాంబినేషన్. వీరిద్దరి కలయికలో 'జనతా గ్యారేజ్' వంటి సూపర్‌హిట్ సినిమా వచ్చింది. మళ్లీ ఎనిమిదేళ్ల తర్వాత ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం దేవర. సక్సెస్ కాంబో కావడం, ఆరేళ్ల తర్వాత తారక్ సోలోగా తెరపై కనిపిస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. కథలకి వెళితే..ఎర్ర సముద్రం తీరంలో గల రత్నగిరి ప్రాంతంలో నాలుగు గ్రామాలు ఉంటాయి. బ్రిటీష్ కాలం నాటి చరిత్ర ఆ ఊరికి ఉంటుంది. ఆ ప్రాంత వాసులు తమ జీవనం సాగించడం కోసం మురుగ (మురళీ శర్మ) కోసం సముద్రం మార్గంలో అక్రమంగా రవాణా జరిగే సరుకును కోస్ట్‌గార్డ్‌లకు చిక్కకుండా మురుగకు అందజేయడం వారి పని. అలా వచ్చిన మొత్తంతో కుటుంబాన్ని పోషిస్తారు. ఆ నాలుగు గ్రామాల్లో ఒక గ్రామంలో నివశించే దేవర భయానికే భయం పుట్టించేంత వీరుడు. సముద్ర మార్గం గుండా వచ్చిన ఆయుధాల వల్ల తమ ప్రాంతానికి చెందిన ఓ పిల్లాడి ప్రాణం పోయిందని తెలిసి ఇకపై మురగ దగ్గర పని చేయకూడదని, మరో మార్గంలో పని చేసుకుందామని చెబుతాడు. అందుకు భైర (సైఫ్ అలీఖాన్) అంగీకరించడు. దేవరను తప్పించి తను సంద్రాన్ని శాసించాలనుకుంటాడు. దాంతో ఇద్దరి మధ్య అంతర యుద్ధం మొదలవుతుంది. దేవర మాత్రం ఊరికి దూరంగా ఉంటూ సంద్రం ఎక్కాలంటే భయపడేలా చేస్తాడు. దాంతో దేవర ప్రాణం తీయడానికి పన్నాగం పన్నుతాడు భైర. ఆ తర్వాత ఏం జరిగింది. అజ్ఞాతంలో ఉన్న తండ్రి దేవర కోసం భయం భయంగా ఉండే వర (ఎన్టీఆర్) ఏం చేశాడు. అసలు రత్నగిరి, ఎర్ర సముద్రంలో ఏం జరిగింది అనేది కథ. రత్నగిరి అనే ప్రాంతంలో సముద్రం, అందులో జరిగే వ్యాపారం, ఆ ప్రాంతంలో బతుకుతెరువు కోసం పనిచేసే మనుషులు ఇతివృత్తంగా సాగే కథ ఇది. బ్రిటీష్ కాలం, ఎర్ర సముద్రం, ఆ ప్రాంత వాసుల ఘనత, ఆ సముద్రానికి కాపలాగా ఉండే దేవర కథను ఓ కేసును చేధించడం కోసం వచ్చిన పోలీస్ ఆఫీసర్ (అజయ్)కు సింగప్ప (ప్రకాశ్‌రాజ్)తో చెప్పిస్తూ కథను నడిపించారు. ఫస్టాఫ్ అంతా ఎర్ర సముద్రం కథ, దేవర, భైరవ పాత్రలు, పోరాటాలు, రత్నగిరిలో జాతర, ఆయుధ పూజ నేపథ్యంలో సాగుతాయి. ఇంటర్వెల్ బ్యాంగ్ నుంచి కథ ట్రాక్ తప్పిన ఫీల్ కలుగుతుంది. అప్పటి వరకూ 'అక్రమ ఆయుధాల రావాణాకు పని చేస్తున్నాం' అనే విషయం తెలియక ఆ పనిని వదిలేసి, కొత్త జీవితం మొదలు పెట్టాలనుకోవడం, అందుకు భైర అండ్ కో అంగీకరించపోవడం అంతా బాగానే సాగింది. దేవరను చంపాలనే స్కెచ్ వేసి దెబ్బ తిన్న భైర బృందం, సంద్రానికి కాపలాగా నేనుంటాను అని చెప్పి దేవర అజ్ఞాతంలోకి వెళ్లడం నుంచి కథ కాస్త గాడి తప్పినట్లు అనిపిస్తుంది. భైరను ఎలా అంతమొం దించాలన్నది రెండో పార్ట్‌లో చూడాలి అన్నట్లు ముగిం పు పలికారు. దర్శకుడు కొరటాల శివ బలం రచన. తను తెరకెక్కించిన హిట్ చిత్రాలు చూస్తే.. కథలో బలం కనిపిస్తుంది. తారక్ నటన, పోరాటాలు, అనిరుద్ సంగీతం సినిమాకు ఎసెట్‌గా నిలిచాయి. సముద్రానికి రారాజుగా ఎన్టీఆర్ పాత్రను చూపిం చారు. ఆ పాత్రకు ఇచ్చిన ఎలివేషన్స్ ప్రేక్షకుల్ని, అభిమానుల్ని అలరిస్తాయి. సమ ఉజ్జీలాంటి రెండు పాత్రలను పవర్‌ఫుల్‌గా తెరపై చూపించారు. దేవరగా తండ్రి పాత్రలో, 'వర'గా యంగ్ ఎన్టీఆర్ పాత్రలో ఆకట్టుకున్నారు. శ్రీదేవి కూతురు జాన్వీకపూ ర్‌కు తెలుగులో తొలి చిత్రమిది. ఆమె పాత్ర గురించి మొదటి నుంచీ మాంచి ఎలివేషన్ ఇచ్చారు కానీ మూ డు సీన్లు, ఓ పాటలకు పరిమితమైంది. విజువల్ ఎఫెక్ట్స్, ప్రొడక్షన్ డిజైన్, క్వాలిటీ విషయంలో నిర్మాత లు ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. అండర్ వాటర్ సీన్స్‌కు బాగా ఖర్చు చేసినట్లు తెరపై కనిపిస్తోంది. రత్నవేలు కెమెరా పనితనం సినిమాకి హైలైట్. సంగీత దర్శకుడు అనిరుద్ నేపథ్య సంగీతంతో అలరించాడు. ఈ చిత్రంలో కొరటాల శివ గత చిత్రాల సన్నివేశాల పోలికలున్నాయి. ఆయన రచనపై ఇంకాస్త దృష్టి పెట్టుంటే అవుట్‌పుట్ మరోలా ఉండేది.

# దేవర మూవీ చూస్తూ ... అభిమాని హఠాన్మరణం

ఎన్టీఆర్ నటించిన 'దేవర' చిత్రం థియేటర్లలోకి రావడంతో అభిమానులు ఎంతో ఉత్సాహంగా తమ అభిమాన హీరో సినిమా చూసేందుకు థియేటర్ల బాట పట్టారు. అదే విధంగా ఓ అభిమాని కూడా ఎన్టీఆర్ సినిమా చూసేందుకు థియేటర్‌కు వెళ్లాడు. సినిమా చూస్తూ ఎంతో ఎంజాయ్ చేశాడు. ఈలలు, కేకలు వేస్తూ సందడి చేస్తూ ఒక్కసారి కూప్పకూలిపోయాడు. అనుహ్యంగా ఒక్కసారిగా జరిగిన ఓ ఘటనతో థియోటర్లోని ప్రేక్షకులు అవాక్కయ్యారు. ఈ ఘటన కడప జిల్లాలో చోటు చేసుకుంది. నగరంలోని అప్సర థియేటర్‌లో 'దేవర' చిత్రం విడు దల సందర్భంగా అపశృతి చోటు చేసుకుంది. సినిమా చూస్తున్న క్రమంలో ఓ అభిమాని కేకలు వేస్తూ ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే అతడిని హుటా హుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వ్యక్తిని పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడు సీకే దీన్నే మండలం జమాల్ పల్లికి చెందిన మస్తాన్ వలిగా గుర్తించారు. ఎంతో ఉత్సాహంగా తమ అభిమాన హీరో జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమాను చూసేందుకు వచ్చిన అభిమాని ఇలా హఠాన్మరణం చెందడం అక్కడి వారిని తీవ్రంగా కలిచివేసింది. మస్తాన్ వలి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.












Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written